క్లుప్తంగా

మూడోసారి అధికారంలోకి వస్తాం

- ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిషోర్‌కుమార్

తిరుమలగిరి : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల ఫలితాల్లో బీఆర్‌ఎస్ మూడవసారి అధికారంలోకి వచ్చి సీఎంగా కేసీఆర్ శాసనసభలో అడుగు పెడతారని తుంగతుర్తి ఎమ్మెల్యే కిషోర్ కుమార్ అన్నారు. గురువారం తిరుమలగిరిలో ఓటు హక్కును వినియోగించుకున్న తరువాత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు ఉన్న ప్రధాన ఆయుధం ఓటు హక్కు అని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన వెంట గాదరి కమల, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వైద్యశిబిరాలు


అర్వపల్లిలోని పోలింగ్ కేంద్రంలో ఓటర్‌కు మందులు ఇస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : పోలింగ్ సందర్భంగా గురువారం మండల పరిధిలోని 32 పోలింగ్ కేంద్రాల్లో వైద్యశిబిరాలను ఏర్పాటు చేశారు. గంటల కొద్ది క్యూలైన్లలో ఉండటం, ఎండకు అస్వస్థతకు గురైనవారికి వెంటనే వైద్యసేవలందించి మందులు పంపిణీ చేశారు.

వరి పొలం దగ్ధం

ఆత్మకూర్ (ఎస్)(సూర్యాపేట) : మండల పరిధిలోని గట్టికల్లు గ్రామంలో గుర్తుతెలియని వ్యక్తులు గురువారం పంట కోసిన వరి కొయ్యలకు నిప్పు పెట్టడంతో పక్కనే కోతకు వచ్చిన వరి పొలం దగ్ధమైంది. ఎన్నికలు కావడంతో అగ్ని ప్రమాదాన్ని గమనించ లేదని, సుమారు లక్ష రూపాయలకు పైగా వరి ధాన్యం కాలి బూడిద అయినట్టు బాధిత రైతు ఏసోబు వాపోయాడు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

కోదాడ మండలంలో పోలింగ్ ప్రశాంతం

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని 16 గ్రామాల్లో గురువారం అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఒకటి రెండు చోట్ల అతి స్వల్ప ఘర్షణలు మినహా అన్ని చోట్ల ప్రశాంతంగా కొనసాగింది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ఆ తర్వాత మూడు నుంచి ఐదు గంటల సమయంలో ఓటు వేసేందుకు ఓటర్లు ఎక్కువగా పోలింగ్ స్టేషన్‌లకు చేరుకున్నారు. గణపవరంలోని 243, 246 బూత్‌లలో కొన్ని ఓట్లు పోల్ అయిన తర్వాత ఈవీఎం మొరాయించడంతో సాంకేతిక నిపుణుడు మరమ్మతులు చేశాడు. అనంతరం పోలింగ్ ప్రారంభించారు. గణపవరంలో వృద్ధులు, వికలాంగులను మరొకరు ఓటు వేసేందుకు తీసుకెళ్తుండగా ఇరు వర్గాల వారు ఘర్షణకు దిగగా పోలీసులు వారిని అక్కడి నుంచి చెదరగొట్టారు. తొగర్రాయి, గుడిబండలో పోలింగ్ కేంద్రాల వద్ద తమ తమ పార్టీలకు ఓట్లు వేయాలని గుర్తులను చెప్పడంతో అక్కడ కూడా స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు. కూచిపూడిలోని 249 బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో రాత్రి ఎనిమిది గంటల వరకు పోలింగ్ నడిచింది. తొగర్రాయిలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ కొనసాగింది.

రాత్రి 8గంటల వరకు కొనసాగిన పోలింగ్


తిమ్మాపురంలో రాత్రి 8.30 గంటల తర్వాత ఈవీఎంలతో వెళ్లడానికి సిద్ధమైన సిబ్బంది

అర్వపల్లి : ఎన్నికల ప్రక్రియ జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం, పర్సాయపల్లి గ్రామాల్లో గురువారం రాత్రి 8 గంటల వరకు జరిగింది. అయితే ఒక్కో బూత్‌లో 1100 నుంచి 1200 వరకు ఎక్కువగా ఓటర్లు ఉండడంతో ఓట్ల ప్రక్రియ ఆలస్యంగా జరిగింది. దీంతో రాత్రి 8 గంటల వరకు ఓటర్లు ఓటు వేశారు.

పోలింగ్ కేంద్రంలో సెల్ఫీ

- యువకుడిపై కేసు నమోదు


నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురంలో గురువారం జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్‌లో ఓ యువకుడు ఓటు వేస్తూ సెల్‌ఫోన్‌లో సెల్ఫీ వీడియో తీసుకున్నాడు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా పోలింగ్ కేంద్రంలోకి సెల్‌ఫోన్ తీసుకొచ్చి సెల్ఫీ వీడియో తీయడం పట్ల సంబంధిత సిబ్బంది పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో అతడిపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

ప్రశాంతంగా ముగిసిన ఎన్నికలు

- సూర్యాపేట నియోజకవర్గంలో 79.95 శాతం పోలింగ్ నమోదు
- తుంగతుర్తి నియోజకవర్గంలో 87.51శాతం


తిరుమలగిరి : తాటిపాములలో ఓటు వేసేందుకు బారులుదీరిన ఓటర్లు


నాగారం : పస్తాలలో..


చివ్వెంల మండల కేంద్రంలో..


నాగారం : ఫణిగిరిలో..

సూర్యాపేట : సూర్యాపేట నియోజకవర్గంలో జరిగిన శాసనసభ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు పట్టణంతో పాటు సూర్యాపేట రూరల్, చివ్వెంల, ఆత్మకూర్ (ఎస్), పెన్‌పహాడ్ మండలాల్లో మొత్తం 271 పోలింగ్ కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలకు బుధవారం రాత్రికే సిబ్బంది పోలింగ్ సామగ్రితో చేరుకుని గురువారం ఉదయం 7గంటల నుంచి పోలింగ్ జరిగేలా అన్ని ఏర్పాట్లు చేశారు. ముందుగా ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్ నిర్వహించారు. పట్టణంలోని 115 పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 4గంటల సమయంలో ఈవీఎం కాసేపు మొరాయించింది. ఇదే సమయంలో అధిక సంఖ్యలో ఓటర్లు రావడంతో పోలింగ్ ఆలస్యమై ఓటర్లు బారులుదీరారు.

మొదట మందకొడిగా..

ఆత్మకూర్ (ఎస్), చివ్వెంల, పెన్‌పహాడ్ మండలాల్లో ఉదయం నుంచే జనం బారులుదీరినా.. గతంలో ఎన్నడూ లేనివిధంగా సూర్యాపేట పట్టణంలో 12గంటల వరకు పోలింగ్ మందకొడిగా సాగింది. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అయితే ఓటర్లు లేకపోవడంతో ఇక్కడ పోలింగ్ ఉన్నదా అన్న రీతిలో సాగింది. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆయా కేంద్రాల్లో ఓటర్లు బారులుదీరారు. ఈ క్రమంలో ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు 9.33 శాతం, 11గంటల వరకు 21.25 శాతం, మధ్యాహ్నం 1గంట వరకు 36.43 శాతం పోలింగ్ నమోదైంది. తిరిగి 3గంటల వరకు 56.57 శాతం, 5గంటల వరకు 72.45 శాతం పోలింగ్ నమోదైంది. 5గంటలలోపు పోలింగ్ కేంద్రాలకు చేరిన వారంతా తమ ఓటుహక్కును వినియోగించుకోగా చివరకు పోలింగ్ శాతం 79.95కు చేరింది. పోలింగ్ ముగిసిన తర్వాత ఈవీఎంలను సూర్యాపేటలోని వ్యవసాయ మార్కెట్‌లో ఉన్న స్ట్రాంగ్ రూంలకు బందోబస్తు నడుమ తరలించారు.

పెన్‌పహాడ్ మండలంలో ప్రశాంతంగా పోలింగ్

పెన్‌పహాడ్ : పెన్‌పహాడ్ మండలంలో 86.46 శాతం పోలింగ్ నమోదైంది. మండల వ్యాప్తంగా 33297 మంది ఓటర్లు ఉండగా 28789 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు ఎన్నికల అధికారి మహేందర్‌రెడ్డి తెలిపారు. వీరిలో 14081 మంది పురుషులు, 14708 మంది మహిళలు తమ ఓటు హక్కు వినియోగించుకున్నట్లు తెలిపారు. మాచారంలోని పోలింగ్ బూత్‌లో ఈవీఎం మొరాయించడంతో ఎన్నికల అధికారి వచ్చి ఈవీఎంను సరిచేశారు.

ఆత్మకూరు మండలంలో పెరిగిన ఓటింగ్

ఆత్మకూరు (ఎస్) : ఆత్మకూరు మండల వ్యాప్తంగా శాసనసభ ఎన్నికలు గురువారం ప్రశాంతంగా ముగిశాయి. గతంలో కంటే ఈసారి ఓటింగ్ శాతం భారీగా పెరిగింది. ఉదయం ఏడు గంటల నుంచే ఓటు వేసేందుకు ప్రజలు పోలింగ్ బూత్ వద్ద బారులుదీరారు. వలస వెళ్లిన వారిని పోటీలో ఉన్న పార్టీల అభ్యర్థుల కార్యకర్తలు ఓటు వినియోగించుకునేందుకు రప్పించారు. మండలంలో మొత్తం 42,685 ఓట్లు ఉండగా సాయంత్రం ఐదు గంటల వరకు 36,007 ఓట్లు పోలయ్యాయి. 84. 36 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. పోలైన ఓట్లలో మహిళలు 17,851మంది ఓటు వేయగా పురుషులు 18,155 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 51 పోలింగ్ కేంద్రాలు ఉండగా మూడు కేంద్రాల్లో సాయంత్రం ఐదు గంటల తర్వాత కూడా పోలింగ్ కొనసాగింది. బొప్పారం, మిడతనపల్లి, బోరింగ్ తండా గ్రామాల్లో రాత్రి వరకు పోలింగ్ కొనసాగింది. ఏపూరులోని 236 పోలింగ్ బూత్‌లో సాయంత్రం 5:30 తర్వాత ఈవీఎం బాక్స్‌లో పేపర్ బండిల్ అయిపోవడంతో 15 నిమిషాలు ఓటింగ్‌ను నిలిపివేశారు. పేపర్ బెండిల్ అమర్చిన తర్వాత ఓటింగ్‌ను కొనసాగించారు.

చివ్వెంల మండలంలో పోలింగ్ ప్రశాంతం

చివ్వెంల : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా కొనసాగింది. ఆయా గ్రామాల్లో ప్రజలు ఉదయం 7గంటల నుంచే తమ ఓటహక్కును వినియోగించుకునేందుకు బారులుదీరారు. మండల కేంద్రంలో రాత్రి వరకు ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు క్యూలైన్లో నిలబడ్డారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు.

తుంగతుర్తి నియోజకవర్గంలో..

తిరుమలగిరి/తుంగతుర్తి : తుంగతుర్తి అసెంబ్లీ స్థానానికి గురువారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. నియోజకవర్గంలోని తొమ్మిది మండలాల్లో 87.51 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ అత్యధికంగా జాజిరెడ్డిగూడెం మండలంలో 89.60, తక్కువగా మోత్కూరు మండలంలో 84.89 శాతం నమోదైంది. కొన్ని చోట్ల కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య, కాంగ్రెస్, పోలీసుల మధ్య స్వల్ప వాగ్వివాదం చోటు చేసుకుంది. నూతనకల్ మండలం బక్కహేమ్లా తండాలో ఇరు పార్టీల మధ్య స్వల్ప ఘర్షణ జరిగింది. మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో రెండు పార్టీల నాయకుల మధ్య స్వల్ప వాగ్వివాదం జరగడంతో పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలను చెదరగొట్టారు. మద్దిరాల మండలంలోని 199, 200 బూత్‌లలో ఒకే పేరు గల ఇద్దరు వ్యక్తులు ఒకరి పేరు పైన మరొకరు ఓటు వేయడంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య స్వల్ప ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. పోలీసులు నచ్చజెప్పడంతో గొడవ సద్దుమణిగింది.

ఓటింగ్ సరళి..

నియోజకవర్గంలో 2,55,017 మంది ఓటర్లు ఉండగా వీరిలో 2,23,165 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాగా నియోజకవర్గ వ్యాప్తంగా 87.51 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఎన్నికల్లో యువతతో పాటు వృద్ధులు, వికలాంగులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. నియోజకవర్గంలో ఉదయం వేళ మందకొడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నానికి పుంజుకుంది. ఉదయం 9 గంటల వరకు 11శాతం, 11గంటల వరకు 33శాతం, 1గంటలకు 51శాతం, 3గంటలకు 65.53శాతం, 5గంటలకు 75.54 శాతం ఓటింగ్ పోలైంది. 5గంటల నుంచి 7గంటల వరకు నియోజకవర్గ వ్యాప్తంగా 87.51శాతంగా పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకట్‌రెడ్డి తెలిపారు.

పోలింగ్ శాతం ఇలా..

మోత్కూరు మండలంలో 84.89శాతం, అడ్డగూడూరు మండలంలో 88.53 శాతం, శాలిగౌరారం మండలంలో 86.93శాతం, నూతనకల్ మండలంలో 87.70శాతం, మద్దిరాల మండలంలో 87.50 శాతం, తుంగతుర్తి మండలంలో 86.80 శాతం, నాగారం మండలంలో 87.08శాతం, జాజిరెడ్డిగూడెం మండలంలో 89.60శాతం, తిరుమలగిరి మండలంలో 89.01 శాతం పోలింగ్ నమోదైంది.


తుంగతుర్తి : వెంపటిలో పసిపాపతో ఓటు వేయడానికి వచ్చిన మహిళ


జాజిరెడ్డిగూడెం మాజీ సర్పంచ్ పున్న ప్రమీలను అర్వపల్లి పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్తున్న సిబ్బంది


చివ్వెంల : బడితండాలో వృద్ధురాలిని ఓటింగ్‌కు తీసుకెళ్తున్న సహాయకుడు


నాగారంలో ఓటు వేసేందుకు పోలింగ్ బూత్‌కు వృద్ధుడిని తీసుకెళ్తున్న సిబ్బంది


మద్దిరాలలో దివ్యాంగుడిని వీల్‌చైర్‌పై తీసుకెళ్తున్న సిబ్బంది


తిరుమలగిరి : తొండ గ్రామంలో..


అర్వపల్లిలో..


తుంగతుర్తి : వెంపటిలో..


ఆత్మకూర్(ఎస్) : కోటినాయక్ తండాలో..


పెన్‌పహాడ్ : దోసపహాడ్‌లో..


నాగారంలో..

పోలింగ్ కేంద్రాల పరిశీలన


మద్దిరాల : పోలుమల్లలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న తుంగతుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి కిషోర్

నాగారం : మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల్లో జరుగుతున్న ఎన్నికల సరళిని గురువారం ప్రధాన పార్టీల అభ్యర్థులు పరిశీలించారు. తుంగతుర్తి బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్ నాగారం మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్‌ను సందర్శించారు. కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేలు ఫణిగిరి, వర్ధమానుకోట గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్‌ను సందర్శించారు. బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య నాగారంలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.

మద్దిరాల : మండల పరిధిలోని పోలుమల్ల గ్రామంలో జరుగుతున్న పోలింగ్ సరళిని బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్ పరిశీలించారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని పోలింగ్ స్టేషన్‌లో ఎన్నికలను బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్ పరిశీలించారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని పోలింగ్ కేంద్రాలను బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్, కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేలు పరిశీలించారు.

పెన్‌పహాడ్ : అనాజిపురం, దోసపహాడ్, నాగులపహాడ్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావు సందర్శించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.

చివ్వెంల : మండల పరిధిలోని బి.చందుపట్లలో పోలింగ్ కేంద్రాన్ని బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావు సందర్శించారు. గుంజలూరులోని పోలింగ్ కేంద్రాన్ని కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్ రెడ్డి సందర్శించారు.

తుంగతుర్తి : గొట్టిపర్తి గ్రామంలోని పోలింగ్ కేంద్రాన్ని బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్‌కుమార్ సందర్శించారు. పోలింగ్ సరళిని పరిశీలించారు. ఆయనతో పాటు ఎంపీటీసీ కేతిరెడ్డి లతావిజయ్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.


చివ్వెంల : బి.చందుపట్లలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న సంకినేని వెంకటేశ్వరరావు


నాగారం : ఫణిగిరిలో పోలింగ్ కేంద్రాన్ని సందర్శిస్తున్న తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి సామేల్

తుంగతుర్తిలో పెరిగిన ఓటింగ్ శాతం

తిరుమలగిరి : తుంగతుర్తి అసెంబ్లీ స్థానానికి గరువారం జరిగిన ఎన్నికల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా పోలింగ్ శాతం 87.51నమోదైంది. నియోజకవర్గంలో 2,50,017 మంది ఓటర్లు ఉండగా 2,23,163 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 1,13,229 మంది మహిళలు 1,09,932 మంది, ఇతరులు ఇద్దరు ఓటు వేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత మొదటి సారి తుంగతుర్తి నియోజకవర్గంలో 2014లో 2,23,666మంది ఓటర్లు ఉండగా 1,74,462 మంది ఓటుహక్కును(78.1శాతం) వినియోగించుకున్నారు. 2018లో 2,16,617మంది ఓటర్లు ఉండగా 1,99,082 మంది (86.3శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత రెండు ఎన్నికల కంటే 2023 ఎన్నికల్లో ఓటర్లు పెరగడమే కాకుండా పోలింగ్ శాతం 87.51శాతం నమోదైంది. 2018 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో కంటే 1.21శాతం పోలింగ్ ఎక్కువగా నమోదైంది.

ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు


తిరుమలగిరిలో ఓటేసి సిరా చుక్క చూపుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి గాదరి కిషోర్ దంపతులు


సూర్యాపేట : ఓటేసి సిరా చుక్క చూపుతున్న కాంగ్రెస్ అభ్యర్థి దామోదర్‌రెడ్డి


సూర్యాపేటలో ఓటేసి సిరా చుక్క చూపుతున్న బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావు

సూర్యాపేట : బీఆర్‌ఎస్ సూర్యాపేట అభ్యర్థి గుంటకండ్ల జగదీష్ రెడ్డి సూర్యాపేటలోని శ్రీచైతన్య టెక్నోస్కూల్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. జగదీష్‌రెడ్డి కుమారుడు వేమన్‌రెడ్డి, కుమార్తె లహరిలు తొలిసారిగా ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి విద్యానగర్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వరరావు కృష్ణానగర్‌లోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఎస్పీ అభ్యర్థి వట్టె జానయ్యయాదవ్ సూర్యాపేట మండలం గాంధీనగర్‌లో ఓటు వేశారు. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటువేశారు. జిల్లా కలెక్టర్ వెంకట్రావ్, అదనపు కలెక్టర్ ప్రియాంకలు సూర్యాపేట జిల్లాకేంద్రంలోని కృష్ణానగర్ కాలనీ పోలింగ్ కేంద్రంలో తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసిన ఎమ్మెల్యే కిషోర్..

తిరుమలగిరి : తుంగతుర్తి శాసన సభ్యుడు గాదరి కిషోర్‌కుమార్ భార్య కమలతో కలిసి మున్సిపాలిటీ పరిధిలోని 308 పోలింగ్ బూత్‌లో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ అడ్డగూడూరు మండలం ధర్మారంలో, బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య నాగారంలో ఓటు వేశారు.

ఆత్మకూర్ (ఎస్) : పీసీసీ జనరల్ సెక్రటరీ అద్దంకి దయాకర్ తన స్వగ్రామమైన నెమ్మికల్‌లో తన కుటుంబంతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బొప్పారంలో జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటనారాయణ గౌడ్ ఓటు వేశారు.

నాగారం మండలంలో..

నాగారం : తుంగతుర్తి బీజేపీ అభ్యర్థి కడియం రామచంద్రయ్య తన స్వగ్రామమైన నాగారంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మంత్రి, సూర్యాపేట బీఆర్‌ఎస్ అభ్యర్థి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కుటుంబ సభ్యులు తమ స్వగ్రామమైన నాగారంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి తండ్రి గుంటకండ్ల రామచంద్రారెడ్డి, వైస్‌ఎంపీపీ గుంటకండ్ల మణిమాలరమేష్‌రెడ్డిలు ఓటు వేసి సిరాగుర్తు చూపారు.

పాలేరు ఎమ్మెల్యే కూతురు కోడూరులో..

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కోడూరుకు చెందిన కాంగ్రెస్ జిల్లా నాయకుడు సామ అభిషేక్‌రెడ్డి-పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కూతురు చైతన్య దంపతులు తమ స్వగ్రామంలో గురువారం ఓటు హక్కును వినియోగించుకున్నారు. అభిషేక్‌రెడ్డి వ్యాపారరీత్యా బెంగళూరులో స్థిరపడ్డారు. అయితే ఓటు హక్కును ఎలాగైన వినియోగించుకోవాలని అక్కడి నుంచి స్వగ్రామానికి వచ్చి ఆఖరి నిమిషంలో పోలింగ్ కేంద్రానికి చేరి ఓటు వేశారు. అర్వపల్లి పోలింగ్ కేంద్రంలో తుంగతుర్తి అసెంబ్లీ బీఎల్‌ఎఫ్ అభ్యర్థి ఈదురు వీరపాపయ్య, తిమ్మాపురం పోలింగ్ కేంద్రంలో సూర్యాపేట అసెంబ్లీ ఇండిపెండెంట్ అభ్యర్థి చామకూరి నర్సయ్య తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కుంచమర్తిలో ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీ నర్సయ్యయాదవ్, అర్వపల్లిలో జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్-మాజీ ఎంపీపీ మనీషా దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు.


నాగారంలో ఓటుహక్కు వినియోగించుకున్న మంత్రి జగదీష్‌రెడ్డి కుటుంబ సభ్యులు


నాగారంలో ఓటుహక్కు వినియోగించుకున్న కడియం రామచంద్రయ్య దంపతులు


ఓటేసిన పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి కూతురు చైతన్య-అభిషేక్‌రెడ్డి దంపతులు